# కట్నమెంత?

రచన;
శ్రీ డి. రామేశమ్.

"ఏమేవ్ అమ్మాయొచ్చింది..." బైట రిక్షా ఆగిన చప్పుడు విని కిటికీలోంచిచూస్తూ భార్యను కేకేశారు పరంధామయ్యగారు.

"ఎవరూ, సరళేమైనా..." అంటూ లోపల్నుంచి హడావిడిగా ముందు హాల్లోకివచ్చింది మహాలక్ష్మమ్మ పరంధామయ్యగారికి కేక విని. రిక్షావాడికి డబ్బులిచ్చి సూటుకేసుతో ఇంటి ఆవరణలో అడుగుపెట్టింది సరళ.

"నేను చెప్పలా, ఇవ్వాళో, రేపో వస్తుందని..." కూతురివంక తృప్తితో నిండిన కళ్ళతో చూస్తూ అన్నది మహాలక్ష్మమ్మ.

"ఏమ్మా సరళా, కులాసాగావున్నావా? ఎప్పుడు బయల్దేరావు?" ప్రశ్నించారు పరంధామయ్యగారు ముందు గదిలో ప్రవేశించిన కూతుర్ని.

"ముందు మీ సంగతి చెప్పండి నాన్నా. మీరూ అమ్మా అంతా కులాసాయేగదా?...మీ ఉత్తరం అందిన వెంటనే బయల్దేరివచ్చేశా. అర్జంటుగా రమ్మని వ్రాశారు, అది చదివిన దగ్గర్నుంచి నా మనసు మనసులో లేదనుకోండి..." గుక్కతిప్పుకోకుండా చెప్పింది సరళ తల్లివైపూ, తండ్రివైపూ పరీక్షగాచూస్తూ.

"మాదేముందే ముసలివాళ్ళమైపోయాము...నువ్వు అదేమిటే అలా చిక్కిపోయావు? నల్లబడిపోయావు కూడాను. ఏమి చదువులోనమ్మా..." కొన్ని నెలల తర్వాత కూతుర్నిచూస్తున్న హృదయంలోంచి మమకారం పెల్లుబికింది.

"ముందు అమ్మాయికి భోజనం వడ్డించవే, ఎప్పుడు భోజనంచేసిందో ఏమో, అన్నీ తర్వాత మాట్లాడుకుందాం..." అంటూ పడక్కుర్చీలోకి వాలి భగవద్గీత చేతిలోకి తీసుకున్నారు పరంధామయ్యగారు.

"అవునమ్మా పద, బాత్‌రూంలో వేడినీళ్ళున్నాయి, వెళ్ళి స్నానంచేసిరా, ఇంతలో నేను వడ్డిస్తాను..." అంటూ వంటగదివైపు దారితీసింది మహాలక్ష్మమ్మ.

తన సూట్‌కేసు తెరిచి టవల్ తీసుకుని మౌనంగా బాత్‌రూంవైపు నడిచింది సరళ.

"ఇప్పుడు నా పెళ్ళికి తొందరేమొచ్చింది నాన్నా?" తండ్రి వంకచూస్తూ ప్రశ్నించింది సరళ.

"ఇప్పుడు మాకువున్న తొందర అది ఒక్కటేనమ్మా" భగవద్గీతను కిటికీలో పెడుతూ చెప్పారు పరంధామయ్యగారు. "ఈ తొందర మాకేకాదమ్మా కూతురికి వయసురాగానే ప్రతి తల్లితండ్రికీ వుండే తొందరే ఇది..."

"నేను ఇంట్లో ఖాళీగా కూర్చోలేదుగా, చదువుతున్నాను...చదువు మధ్యలో ఆపటం..."

"ఏం చదువులమ్మా, పాడు చదువులు..." సరళ చెప్పేది పూర్తికాకుండానే అప్పుడే ఆ గదిలో అడుగుపెట్టిన మహాలక్ష్మమ్మ ఆడపిల్లల చదువుమీద తనకున్న ఏహ్యభావాన్ని వ్యక్తంచేస్తూ చెప్పింది, ముందు ఇంటర్‌మీడియట్ చదివి ఆపేస్తానన్నావు. ఆతర్వాత వూళ్ళో చదువేకదా బి.ఏ. లో చేరుతానన్నావు, అక్కడితో వూరుకున్నావా? బి.ఏ. లో క్లాసువచ్చింది, ఎమ్.ఏ. చదువుతానంటూ ఎక్కడికో వెళ్ళావు. ఆతర్వాత ఇంకేదో చదువుతానంటావు. ఎప్పటికి పూర్తవును?... అయినా నువ్వు చదువులుచదివి ఉద్యోగాలుచెయ్యాలా? రాజ్యాలేలాలా?...ఆడపిల్ల ఎప్పటికైనా ఆడపిల్లే.

"అంటే వీలున్నంత తొందర్లో నాబరువు వదిలించుకుందామనుకుంటున్నారా?..." సరళ కొంచం కటువుగా అడిగింది.

"అక్కడే పొరబడుతున్నావమ్మా, చెప్పారు పరంధామయ్యగారు" పిల్లలు ఎప్పుడూ తల్లితండ్రికి బరువు కాదు, కూతురు ఎన్ని తప్పులుచేసినా, సమాజం ఎంత వెలివేసినా తల్లి ఆ కూతుర్ని కౌగలించుకుని కన్నీళ్ళు కారుస్తుంది తప్ప అందరిలా ప్రవర్తించలేదు. నువ్వు గౌరవంగా చదువుకుంటుంటే మాకు బరువేమిటి? ఏదో అనుకోకుండా అవకాశం వెతుక్కుంటూ వచ్చింది కాబట్టి...రవిని చేసుకోవటం నీకు ఇష్టంలేకపోతే చెప్పు ... మధ్యలో ఆపి కూతురి కళ్ళలోకి ప్రశ్నార్థకంగా చూశారు పరంధామయ్యగారు.

రవి పేరు వినటంతోనే సరళ హృదయం ఝల్లుమంది, 'మీ ఇష్టం నాన్నా..." తలవంచుకుని చెప్పి వడివడిగా తనగదిలోకి వెళ్ళిపోయింది.




మంచంమీద పడుకుని కళ్ళుమూసుకుంది గాని సరళ మనసు రకరకాల ఆలోచనల్లోమునిగి తేలుతోంది. రవి...ఆ వూళ్ళో పేరు, డబ్బు, గౌరవం మూడిండికి మారుపేరైన డా॥ చక్రధరంగారి ఏకైక పుత్రుడు చిన్నప్పటినుంచీ మంచి అలవాట్లతో కష్టపడి చదివి, తండ్రినిమించిన కొడుకనిపించుకున్నాడు, అటువంటి రవికి తను భార్య కాబోతోంది, అది నిజంగా తన అదృష్టమే, అందుకే రవిపేరు వినగానే వెంటనే పెళ్ళికి ఒప్పుకుంది, కాని తన ఆదర్శం...రవి అందుకు అంగీకరిస్తాడా? తనకి సహకరిస్తాడా? అలా సహకరించని నాడు తను ఎవర్నీ లెక్కచేయదు.

♦ ♦ ♦

పెళ్ళిచూపులు ముగిసాయి, సరళ తన గదిలోకి వెళ్ళిపోయింది, అసలు పెళ్ళిచూపులంటూ జరగకపోను, చక్రధరంగారికి ఆయన భార్యకి సరళ కొత్త ఏమీకాదు. వాళ్ళు సరళను చిన్నప్పటినుంచి చూస్తూనేవున్నారు, ఇక రవి, సరళ కలిసి ఒకే స్కూల్లో, ఒకే క్లాసులో చదివినవాళ్ళే. కానీ ఢిల్లీలో స్థిరపడిపోయి ఏదో పనిమీద ఈవూరువచ్చిన తన అన్నగార్కి సరళను చూపించటంకోసం చక్రధరంగారు ఏర్పాటుచేయించారు ఈ పెళ్ళిచూపులు.

"ఏమండీ ఇక తాంబూలాలు పుచ్చుకునే ఏర్పాటు చేద్దామా?" తన వృత్తి ధోరణిలో అడిగాడు పురోహితుడు.

"ఏం అన్నయ్యా, ఏమంటావు?" చక్రధరంగారు ప్రశ్నించారు అన్నగార్ని.

"ఇంకా ఆలస్యం దేనికి రవికి నచ్చిన సంబంధమే కదా...అది సరే ఇంతకీ కట్నమెంత?" గోల్డు ఫ్రేం కళ్ళజోడు తీసి చేతిలోపట్టుకుంటూ అడిగాడు చక్రధరం అన్నగారు.

"కట్నమా..." చక్రధరంగారి నోట్లోంచి మాట పూర్తిగా బయటకు రాలేదు.

"కనీసం పదివేలైనా లేకపోతే ఎలా? రవికేం తక్కువ?" కుర్చీలో వెనక్కి వాలుతూ చెప్పాడు చక్రధరం అన్నగారు.

పరంధామయ్యగారి మనసులో ఆందోళన బయల్దేరింది, ఈమాటలు విన్న సరళ హృదయం ఒక్కసారి ఉలిక్కి పడింది, కొద్దిక్షణాలు మౌనంరాజ్యం చేసిందాగదిలో.

♦ ♦ ♦

సరళ పెళ్ళి అనుకున్న దానికన్నా బాగా జరిగింది, ఇవ్వాళ సరళ కాపురానికి వెళ్ళబోతుంది. పడకకుర్చీలో మేనువాల్చి శూన్యంలోకిచూస్తూ ఆలోచిస్తున్న పరంధామయ్యగారి ముఖంలో ఆనందంతోనిండిన గంభీరత స్పష్టంగా వ్యాపించింది.

"నాన్నా..." అప్పుడే ఆ గదిలో ప్రవేశించి తండ్రి దగ్గరకువస్తూ పిలిచింది సరళ, "ఇది తీసుకోండి నాన్నా..." అంటూ తన చేతిని ముందుకుచాచింది.

"ఏమిటమ్మా అది?...డబ్బు..." సరళ తనని తీసుకోమంటున్న వంద రూపాయల నోట్లు కట్టని చూసిన పరంధామయ్యగార్ని ఆశ్చర్యం ఆక్రమించింది. నోట్లోంచి మాటలు స్పష్టంగారాలేదు.

"అవును నాన్నా, ఆయనే మీకు ఇవ్వమన్నారు. మీరు ఆయనకి కట్నంగా ఇచ్చిన పదివేలు..."

"అవునండీ, నేనే ఇమ్మన్నాను..." అంటూ ఆ గదిలోకి వచ్చాడు రవి.

"నేను తీసుకోవటం ఏమిటి బాబూ, అది నీకు కట్నంగా ఇచ్చిన డబ్బు..." పరంధామయ్యగారి ముఖంలో ఆశ్చర్యరేఖలు ఇంకా అలాగేవున్నాయి.

"నేనుమాత్రం ఎందుకు తీసుకోవాలి?" పరంధామయ్యగారి ఎదురుగా కుర్చీలో కూర్చుంటూ చెప్పాడు

రవి, "ఈ కట్నం అనేది ఎవరు, ఎందుకు మొదలు పెట్టారో తెలీదు. పాత ఆచారాలని అంటిపెట్టుకుని కొందరు, డబ్బుకి దాసులై ఎందరో, ఇంకా ఈ రాక్షసారాధనకి ఆడపిల్లల తండ్రుల్ని బలిపశువుగా మారుస్తూనేవున్నారు.

నా మనసులో మొదటినుంచీ కట్నం తీసుకోకూడదనివున్నా, పెళ్ళిచూపుల రోజున మా పెదనాన్న గారు కట్నం తీసుకోవాలని మొండిపట్టుపడితే నేను మౌనంగా వున్నాను. దానికి కారణం మా నాన్న గారికి అన్న గారి మాటంటే వేదవాక్కు. నా పెళ్ళివిషయంలో మా నాన్న గారికి కావాల్సింది కట్నం_డబ్బు, నగలు కాదు, నలుగురిలో గౌరవం. కట్నం తీసుకోకుండా నేను పెళ్ళిచేసుకుంటే నాలో ఏదో లోపంవుందని ఊహించే నలుగురికి ఆ అవకాశం ఇవ్వకూడదనేదే మా నాన్న గారి అభిప్రాయం. ఆ స్థితిలో మా నాన్న గారి ఆలోచనల్ని కాదని ఎదిరించి, ఆ గౌరవాన్ని ఇంకోవిధంగా సంఘంలోకి ఈడ్చే ప్రయత్నం చేసేందుకు నామనసు అంగీకరించలేదు.

పెళ్ళిచూపులైన మర్నాడు సరళ నన్ను కలుసుకుంది నేను కట్నం ఆశించే పరిస్థితిలో తను ఈ వివాహానికి అంగీకరించనని, గట్టిగా చెప్పింది. మీరు ఎంత కష్టపడి, మీదిగా మిగిలిన ఈ ఇల్లు తాకట్టుపెట్టైగాని పదివేలు తేలేరని నాకు తెలుసు. ఆ తర్వాత ఈ అప్పు తీర్చే మార్గం లేకపోగా పెళ్ళిచెయ్యాల్సిన పిల్లలు ఇంకా వున్నారనికూడా తెలుసు. అందుకే ఇలా ప్లాను వేశాం.

సరళ చదువుకున్నది గనుక ధైర్యంగా తన మనసులోని ఆలోచన చెప్పి తన ఆదర్శం నెరవేర్చుకోగలిగింది. స్త్రీకి పెళ్ళి ఎంత అవసరమో పురుషుడికీ అంతే. స్త్రీలోని అబలత్వం నశించి సరళలా అందరూ ఏదో శక్తి సంపాదించి తమ జీవితానికొక ధైర్యాన్ని ఏర్పరుచుకోగలిగిననాడు ఈలాంటి రాక్షసారాధనలు పూర్తిగా అంతరించే అవకాశం లభిస్తుంది.

పరంధామయ్యగారి కనుకొలుకుల్లోంచి రెండు ఆనంద బాష్పాలు ఆయనకు తెలియకుండానే గుండెలమీదకు జారాయి.

★


మీ బంధుమిత్ర సమేతముగా దర్శించండి!!

# కోడైకానల్

దక్షిణ దేశంలో వేసవికాలపు విశ్రాంతి కేంద్రం. మీరు విశ్రాంతి పొందుటకు అధునిక సదుపాయాలతో కూడిన

# హాలిడే హోం

(విశ్రాంతి మరియు భోజన భవనం)

కోడైకానల్ – 624101.

ఫోన్ : 257 గ్రామ్స్ : "హాలీడేహోం"

10–4–77 నుంచి ప్రారంభమై వేసవి కాలం పూర్తి అయ్యే వరకూ తెరిచియుండును. రుచికనుగుణమైన, పాశ్చాత్య ఫక్కీలోకాని, భారత సంప్రదాయ రీత్యాకాని (శాఖాహార మరియు మాంసాహార) భోజనం ఇక్కడ సమకూడుతుంది.

—— ఇదికూడా మనదే ——

# జయా లాడ్జ్

మరియు

# హొటల్ జయరాజ్

(బసచేయుటకు మాత్రమే)

***

సంవత్సరం పొడుగునా తెరిచియుండే—

# ... పాక్కియ దీపం ...

(రుచికరమైన శాఖాహార భవనం)

బస్ స్టాండ్ రోడ్డు – కోడైకానల్ – 624101.

ATHMAS